సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 7 । మార్చి । 2023



వైభవంగా డోలోత్సవం

వేములవాడఅర్బన్: రాజన్న సన్నిధిలో త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు డోలోత్సవం నిర్వహించారు.



అంజన్న ఆదాయం రూ.4.70లక్షలు

వేములవాడఅర్బన్: అగ్రహారం శ్రీహనుమాన్ ఆలయం హుండీ ఆదాయం రూ.4,70,523 ఈవో మారుతి

గరిష్ఠం/కనిష్ఠం
36.0/19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీలు పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 40 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడూ పరిష్కరించాలన్నారు. ఏవో గంగయ్య, జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కమాండెంట్ సుబ్రహ్మణ్యం

సిరిసిల్లఅర్బన్: మహిళలు పురుషుల సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని బెటాలియన్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం కోరారు. సోమవారం 17వ పోలీస్ బెటాలియన్‌లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని.. బెటాలియన్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని సన్మానించారు.

మోడల్‌స్కూల్ సందర్శించిన డీఈవో



మోడల్ స్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం మండెపల్లి మోడల్‌స్కూల్‌ను సోమవారం జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలు ఎలా రాయాలో పలు సలహాలు, సూచనలు చేశారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రిన్సిపాల్ మేడిపల్లి రమేశ్ పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం మండెపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా మూడు నెలలపాటు అప్పారెల్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.కనకయ్య ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 40 ఏళ్లలోపు స్కూల్, కాలేజీ డ్రాపౌట్ గల వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత తమ సర్టిఫికెట్స్, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, 2 ఫొటోలతో ఈ నెల 18వ తేదీలోపు మండెపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో, 80081 73164, 95056 74905లలో సంప్రదించాలని కోరారు.

అమరుల త్యాగాలను స్మరించుకుందాం



మాట్లాడుతున్న జంగం అంజయ్య

వీర్నపల్లి(సిరిసిల్ల): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరుల త్యాగాలను స్మరించుకుందామని సీపీఐ రైతుసంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మహ్మదాపూర్ అమరులకు నివాళి అర్పించారు. అంజయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రలో తెలంగాణ విముక్తి కోసం అనేక ఉద్యమాలు కొనసాగాయన్నారు. మహ్మదాపూర్ గుట్టల్లో 12 మంది వీరులు నేలకొరిగారని, అమరుల త్యాగాలను స్మరించుకునేందుకు సోమారంపేట, గాలిపల్లి, తాళ్లపెల్లి గ్రామాల్లో స్థూపాలు నిర్మించుకుందామన్నారు. ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలవాలి

- షాదీఖానా టెంట్ మెటీరియల్‌కు రూ.10 లక్షలు
- రూ.3.10 కోట్లతో రగుడు జంక్షన్ అభివృద్ధి
- రూ.4.60 కోట్లతో రెండో బైపాస్‌రోడ్డుపై సెంట్రల్ లైటింగ్
- పిల్లల్లో స్థూలకాయ సమస్యపై పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్



షాదీఖానాను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: కుల, మతాలకతీతంగా పేదలకు అండగా నిలవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు కోరారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవై నగర్‌లో రూ.1.10 కోట్లతో నిర్మించిన ఉర్దూభవన్, షాదీఖానాలను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. షాదీఖానాను మంచి వెంటిలేషన్‌తో నిర్మించారని, మున్సిపల్ అధికారులు, మజీద్ కమిటీ పెద్దలు, మైనార్టీ సంక్షేమాధికారులు సంయుక్తంగా షాదీఖానాను నిర్వహించాలని సూచించారు. షాదీఖానాలో పెళ్లిళ్లు, శుభకార్యాలకు టెంట్ మెటీయల్, బోళ్లకు రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అయితే షాదీఖానాను పేదలకు ఉచితంగా అందించాలని, ఆర్థికంగా ఉన్న వారి వద్దనే డబ్బులు తీసుకోవాలని మంత్రి సూచించారు. షాదీఖానాకు ఐదుగుంటల భూమిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, కానీ వివాదం లేకుండా ప్రభుత్వ స్థలం ఎక్కడున్నా తీసుకోవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ఏదో ఒక్కటి అందుతుందన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, సిరిసిల్ల మజీద్ కమిటీ చైర్మన్ షేక్ యూసుఫ్, మజీద్ కమిటీ ప్రతినిధులు సయీద్‌ఖాన్, ఎండీ సలీం, ఎండీ సత్తార్, సయ్యద్ అక్రమ్, మునీర్, రఫీయొద్దీన్, ఉస్మాన్, అబ్దుల్ ఖాదర్, మహమూద్, రీనా బాబా తదితరులు పాల్గొన్నారు.

రగుడు కూడలి అభివృద్ధికి శంకుస్థాపన

సిరిసిల్ల పట్టణ శివారులోని రగుడు కలెక్టరేట్ కూడలి అభివృద్ధికి, రెండో బైపాస్ రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. రగుడు జంక్షన్‌ను రూ.3.10 కోట్లతో విస్తరించనున్నారు. రగుడు–వెంకటాపూర్ రెండో బైపాస్ రోడ్డుపై రూ.4.60 కోట్లతో సెంట్రల్ లైటింగ్స్ ఏర్పాటు చేయనున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీసీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ పోచవేని సత్య ఉన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి అండగా ఉంటా..

సిరిసిల్లటౌన్: జర్నలిస్టుల సంక్షేమానికి అండగా ఉంటానని మున్సిపల్ మంత్రి కె.తారకరామారావు పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలను మంత్రికి వివరించగా.. ఆయన స్పందిస్తూ అర్హులైన జర్నలిస్టులందరికీ నివేశన స్థలాలు అందిస్తామన్నారు.

సైన్స్‌ల్యాబ్ ప్రారంభం



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సామాజిక సేవకుడు దుబ్బాక రమేశ్ సొంత ఖర్చులు రూ.5.75 లక్షలతో ఏర్పాటు చేసిన సైన్స్‌ల్యాబ్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. వారికి సైన్స్‌పై ఉన్న అవగాహనను తెలుసుకొని అభినందించారు. అనంతరం జిల్లెల్ల గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాను ప్రారంభించి ఆశ వర్కర్లతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ఆశవర్కర్లకు అత్యధికంగా వేతనాలు ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని స్పష్టం చేశారు. సంఘాల స్వలాభం కోసం రెచ్చగొడతాయని.. ఆశవర్కర్లు ఆలోచించాలని కోరారు. కరోనా సమయంలో ఆశవర్కర్ల సేవలు వెలకట్ట లేనివని కొనియాడారు. కరోనా సంక్షోభంతో ఆశవర్కర్ల వేతనాలు పెంచలేకపోయామని, పరిస్థితులు బాగుపడ్డాక పెంచుతామన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన జిల్లెల్లకు చెందిన మాజీ ఎంపీపీ పూసపెల్లి సరస్వతిని మంత్రి పరామర్శించారు. సారంపల్లి సర్పంచ్ కొయ్యడ రమేశ్ తమ్ముడి వివాహం ఇటీవల జరుగగా నూతన వధూవరులను మంత్రి కేటీఆర్ ఆశీర్వదించారు. తంగళ్లపల్లి ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి ఇంటికెళ్లి కాసేపు ముచ్చటించారు. జిల్లెల్ల సర్పంచ్ మాట్ల మధు, ఎంపీటీసీ చెన్నమనేని వెంకట్‌రావు, ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల తదితరులు ఉన్నారు.

స్థూలకాయ నివారణకు కృషి చేద్దాం



స్థూలకాయ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

సిరిసిల్లకల్చరల్: స్థూలకాయ నివారణకు కృషి చేద్దామని మంత్రి కేటీఆర్ కోరారు. ప్రపంచ స్థూలకాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పిల్లల వైద్యులు రూపొందించిన పోస్టర్‌ను మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. నిత్యం వ్యాయామం చేయడం, మితంగా తినడం ద్వారా స్థూలకాయాన్ని తగ్గించవచ్చన్నారు. రాజన్న సిరిసిల్ల పిల్లల వైద్యుల అకాడమీ అధ్యక్షుడు మురళీధర్‌రావు, కందేపి ప్రసాద్‌రావు, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కల్పించండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: గుండెకు సంబంధించిన సమస్యలపై కార్డియో పల్మనరీ రిససిటేషన్(సీపీఆర్) ఎక్కువ మందికి అవగాహన కల్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. ఇటీవల సడెన్‌గా కార్డియాక్ అరెస్టులు (గుండె ఆగిపోవడం) జరుగుతున్నాయని దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. సకాలంలో సీపీఆర్ చేయడం ద్వారా చనిపోయేవారి సంఖ్య తగ్గుతుందన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. ప్రతీ మండలానికి ఇద్దరు ట్రైనర్లు వెళ్లి సీపీఆర్‌పై చైతన్యవంతులను చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, మహేశ్‌రావు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

కిరాణషాపుల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు

వేములవాడఅర్బన్/చందుర్తి: వేములవాడ మండలం సంకెపల్లిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, కిరాణ దుకాణాలను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ క్యారీబ్యాగ్స్ వినియోగిస్తున్న దుకాణ నిర్వాహకులకు జరిమానాలు విధించారు. చందుర్తి మండలం మల్యాలలోని దొంతుల రమేశ్ కిరాణం షాపుపై దాడిచేసి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకొని రూ.500 జరిమానా, కొత్త శ్రీకాంత్ దుకాణంలో ప్లాస్టిక్ కవర్లు పట్టుబడడంతో దుకాణాన్ని సీజ్ చేసినట్లు ఎంపీవో ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆశిరెడ్డిపల్లెలో ఎర్ర సత్తయ్య దుకాణంలో ప్లాస్టిక్ కవర్లు లభ్యం కాగా జరిమానా విధించారు. ఆకుల శ్రీనివాస్, నగేశ్, రవిశంకర్, దేవరాజం, వినయ్, శ్రీనివాస్, నరేందర్, మహేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే కొండగట్టు అభివృద్ధి

- అధికారంలోకి రాగానే మరిన్ని వసతులు కల్పిస్తాం
- బస్సు ప్రమాద బాధితులకు ఎలాంటి సాయమూ అందలేదు
- నాడు ఆ ఘటనపై సీఎం స్పందించకపోవడం సిగ్గుచేటు
- హాథ్ సే హాథ్ జోడోలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



కొండగట్టులో పూజలు చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కొండగట్టు/కొడిమ్యాల: కాంగ్రెస్ హయాంలోనే కొండగట్టు ఆలయ అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మరింత అభివృద్ధి చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా సోమవారం కొండగట్టులోని శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ మారుతిస్వామి శాలువతో సన్మానించి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఆలయ స్థల పురాణం గురించి అర్చకులు వివరించారు. అనంతరం ఆలయ ఆవరణలో మాట్లాడారు. ఘాట్‌రోడ్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో మృతిచెందిన, క్షతగాత్రుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎలాంటి సాయమూ అందలేదన్నారు. నాడు ఆ ఘటనపై సీఎం కేసీఆర్ స్పందించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇటీవల కొండకు వచ్చిన సీఎం ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని వాగ్దానం చేశారని, తనకు నమ్మకం లేదన్నారు. 800 ఎకరాలలో ఆలయాన్ని గొప్పగా అభివృద్ధి చేయవచ్చన్నారు. సీఎం కేసీఆర్ వెంటనే రూ.500 కోట్లు విడుదల చేసి ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొండపై పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు వారి సమస్యలను రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు.

పోతారం నిర్వాసితులను ఆదుకోవాలి

అంజన్న దర్శనం అనంతరం కొడిమ్యాల మండలం పోతారం పెద్ద చెరువు రిజర్వాయర్‌ను రేవంత్‌రెడ్డి సందర్శించారు. నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. రిజర్వాయర్ నిర్మాణ సమయంలో కోనాపూర్‌లోని 135 ఇళ్లకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తిస్తుందని ప్రభుత్వాధికారులు పేర్కొన్నారని, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఎన్నికైనా ఈ సమస్య ఇప్పటికీ పరిష్కరించలేదని విమర్శించారు. రిజర్వాయర్ సమీపంలోని కొడిమ్యాల– కోరుట్ల రోడ్డుపై గల బుగ్గవాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షాకాలంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారన్నారు. పోతారం రిజర్వాయర్ మత్తడి ఎత్తును పెంచి, బుగ్గవాగుపై బ్రిడ్జి నిర్మించాలని, నిర్వాసితులకు పరిహారం అందించాలని కోరారు. కేవలం రూ.25 కోట్ల వ్యయంతో ఈ మూడు సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు ఈ సమస్యల పరిష్కారానికి స్థానికుల ద్వారా ప్రజావాణిలో ఫిర్యాదు చేయించడంతోపాటు, ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు కొడిమ్యాలలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. సాయంత్రం పాదయాత్ర పూడురు నుంచి గంగాధర వరకు కొనసాగింది. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపెల్లి సత్యం, యూత్ కాంగ్రెస్ నాయకుడు నాగి శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణ, నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, దొంగ ఆనందరెడ్డి, ముత్యం శంకర్, చారి, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవిశంకర్‌పై చార్జ్‌షీట్ విడుదల

కొడిమ్యాల మండల కేంద్రంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవి శంకర్‌పై కాంగ్రెస్ నాయకులు సోమవారం చార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, తొమ్మిదేళ్లయినా పోతారం రిజర్వాయర్ పనులు ఎమ్మెల్యే పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు. రెండుసార్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించినా నియోజకవర్గానికి చేసిందేం లేదన్నారు. సొంత గ్రామంలో రైతులపై కక్షగట్టిన కఠినాత్ముడని విమర్శించారు. మళ్లీ కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందన్నారు.

వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

సిరిసిల్లఅర్బన్: పోలీస్‌శాఖలో పనిచేస్తున్న సిబ్బంది కాలానుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. తాడూరులోని జిల్లా పోలీస్ హెడ్‌క్వాటర్స్‌లో సోమవారం నిర్వహించిన మొబిలైజేషన్ పరేడ్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొదటగా సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించి, 14 రోజులపాటు శిక్షణ తీసుకున్న పరేడ్, స్క్వాడ్ డ్రిల్, లాఠీ డ్రిల్, మాబ్ ఆపరేషన్ డాగ్‌స్క్వాడ్‌లో పనిచేస్తున్న జాగిలాల ప్రతిభను వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ బందోబస్తు సమయంలో ఎలాంటి ఆవేశాలకు లోనుకాకుండా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. వ్యాయామం, యోగా నిత్యజీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు విశ్వప్రసాద్, రవికుమార్, ఆర్‌ఐలు కుమారస్వామి, రజనీకాంత్, యాదగిరి, సీఐలు అనిల్ కుమార్, ఉపేందర్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపు

- 10వ వార్డులో డ్రా ద్వారా ఎంపిక



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

సిరిసిల్లఅర్బన్/సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి 10వ వార్డు చిన్నబోనాలలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులను సోమవారం డ్రా ద్వారా ఎంపిక చేశారు. గతంలో మూడుసార్లు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఎంపిక సభను నిర్వహించగా.. అవకతవకలు జరిగాయని ఆరోపించడంతో అధికారులు ఈ ప్రక్రియను నిలిపివేశారు. వారం క్రితం వార్డు కౌన్సిలర్ బొల్గం నాగరాజు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆందోళన చేపట్టాడు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అధ్యక్షతన సోమవారం వార్డుసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొత్తం 82 మంది అర్హులు ఉండగా, 44 మందిని డ్రా ద్వారా ఎంపిక చేశారు. ప్రత్యేకాధికారి శివకుమార్, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పదో వార్డుపై వివక్ష

సిరిసిల్ల పట్టణంలో ఏ వార్డులలో కనిపించని వివక్ష ప్రతిపక్షాల కౌన్సిలర్ల వార్డులపై చూపుతున్నారని కౌన్సిలర్ బొల్గం నాగరాజు ఆరోపించారు. పదో వార్డులో జరిగిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నాగరాజు మాట్లాడుతూ 10వ వార్డులో 82 మంది ఇళ్లు లేని నిరుపేదలు ఉంటే 44 మందిని మాత్రమే ఎంపిక చేయడం అన్యాయమన్నారు. మిగిలిన 38 మంది నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరారు.



నమో రాజన్న

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్నను సోమవారం భారీగా భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి కోడెమొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



కామదహనం

సిరిసిల్లటౌన్: కాముని పౌర్ణమి వేడుకలు సిరిసిల్లలో మిన్నంటాయి. హోలి పండుగకు ఒక్క రోజు ముందుగా నిర్వహించే కామదహనం సోమవారం జిల్లా కేంద్రంలోని వాడవాడల్లో జరిగాయి. చిన్న..పెద్దా.. ఆటపాటలతో అలరించారు.

అభివృద్ధి పనులపై ఆరా

- మూడో రోజు శిక్షణ అధికారుల పర్యటన

ఎల్లారెడ్డిపేట/వేములవాడరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు ఎంత వరకు ఉపయోగకరంగా ఉన్నాయని సివిల్స్ శిక్షణ అధికారులు ఆరా తీశారు. మండలంలోని రాజన్నపేటలో సోమవారం పర్యటించారు. పల్లె ప్రకృతివనం, శ్మశానవాటిక, నర్సరీ, కంపోస్టుషెడ్, మంకీ ఫుడ్‌కోర్టులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ పాలకవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. శిక్షణ అధికారులు అర్జున్‌గుప్తా, అన్‌చల్ జైన్, పంకజ్‌మీనా, హర్షిత్‌అగర్వాల్, అంకితమోండల్, సర్పంచ్ ముక్క శంకర్, ఎంపీవో వజీర్, కార్యదర్శి రవి, ఏపీవో కొమురయ్య పాల్గొన్నారు.



రాజన్నపేటలో ఉపాధి పనుల పరిశీలన

క్షేత్రస్థాయిలో పరిశీలన

వేములవాడరూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో సివిల్స్ శిక్షణ అధికారులు వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాల అమలుతీరును తెలుసుకున్నారు. పాఠశాలతోపాటు కంటివెలుగు కార్యక్రమాలను పరిశీలించారు.

క్లుప్తంగా

యూకేలో ఘనంగా మహిళా దినోత్సవం



యూకేలో కేక్ కట్ చేస్తున్న మహిళలు

వేములవాడఅర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యూకేలో స్థిరపడిన తెలుగు ప్రాంతానికి చెందిన మహిళలు ముందస్తు మహిళా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూకేలోని హర్రో ప్రాంతంలో మీనవల్లి శ్రీదేవి, క్షీరసాగర ప్రతిమ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. లండన్, స్కాట్లాండ్‌లతోపాటు ఇతర ప్రాంతాలలో నివసించే దాదాపు 250 మంది మహిళలు హాజరయ్యారు.

కవులకు సన్మానం



పురస్కారం అందజేస్తున్న చిటికెన కిరణ్‌కుమార్

సిరిసిల్ల కల్చరల్ : తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ, నవభారత నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మాతృభాషా దినోత్సవాల్లో జిల్లావాసి చిటికెన కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. పలువురు కవులు, రచయిత్రిలను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అమృత్ కుమార్ జైన్, ఆశిష్ విద్యాసంస్థల అధ్యక్షురాలు భారతి, రామకృష్ణ చంద్రమౌళి, తోట శ్రవణ్‌కుమార్ సంపత్‌కుమార్, డాక్టర్ రాధాకుసుమ, పలు ప్రాంతాల కవులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న సతీశ్

ఎల్లారెడ్డిపేట : విద్యాభివృద్ధికి ఓ సామాజిక కార్యకర్త రూ.50 వేలు విరాళం అందజేశారు. మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన కోట రాజేశం కుమారుడు సతీశ్ రూ.50 వేల చెక్కును సోమవారం ప్రధానోపాధ్యాయుడు మురళీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ పాఠశాలలో పనిచేసే స్వీపర్ల వేతనాల కోసం విరాళం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాశం సరోజన, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు జబ్బర్, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సుద్దాలలో మోటార్లు చోరీ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని సుద్దాలలో నాలుగు వ్యవసాయ మోటార్లు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కుంటెల్లి మల్లయ్యకు చెందిన 5 హెచ్‌పీ మోటార్, దొబ్బల దేవయ్యకు సంబంధించిన 3 హెచ్‌పీ మోటార్, పల్లి బుచ్చిరాములు 3 హెచ్‌పీ, శీల శ్రీనివాస్ 3 హెచ్‌పీ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితులు సోమవారం కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సైబర్ నేరాలపై సీరియస్

- కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు
- టెక్నాలజీపై అవగాహన పోలీసులకు విధులు
- త్వరలో ప్రతీ స్టేషన్‌లో సైబర్ టీం
- ఎస్పీ అఖిల్ మహాజన్



నూకలమర్రిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగరాజు

సిరిసిల్ల క్రైం : ఆధునిక సాంకేతికత పెరుగుతున్న ప్రస్తుత నేపథ్యంలో అందరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు ఉండడం సాధారణంగా మారింది. దీనికి బ్యాంకు ఖాతాలతో ఫోన్ నెంబర్లు అనుసంధానం చేయగా నిత్యావసరాల కోసం ప్రతిఒక్కరూ నగదు రహిత లావాదేవీలను కొనసాగిస్తున్నారు. డిజిటల్ లావాదేవీలు విస్తరిస్తుండగా అంతేవేగంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. మొబైల్‌లో వివిధ రకాల సైట్లలో మనకు అవసరమైన వస్తువులు అతితక్కువ ధరకు వస్తాయని వచ్చే ప్రకటనలకు ఆకర్షితులైన వెంటనే ఆ లింకులపై క్లిక్ చేస్తున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు అకౌంట్‌లోని సొమ్మును కాజేస్తున్నారు.

ప్రజలను అప్రమత్తం చేసే దిశగా..

రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతుండగా నియంత్రణకు జిల్లా పోలీస్ శాఖ ప్రజలను అప్రమత్తం చేసే దిశగా అడుగులు వేస్తోంది. దీనిపై జిల్లా పోలీస్ బాస్ సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. ఎక్కడ సైబర్ మోసాలు జరిగినా కేసులు నమోదు చేయాలని ఇప్పటికే జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులను ఆదేశించారు. నూతన టెక్నాలజీపై అవగాహన కలిగిన పోలీసు అధికారులకు విధులు అప్పగిస్తున్నారు. ఇప్పటికే సైబర్ వారియర్స్ పేరిట సిబ్బందికి శిక్షణ సైతం అందించారు.

అవగాహన కార్యక్రమాలు అవసరం

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రజలను అప్రమత్తం చేసేందుకు గ్రామస్థాయి నుంచి సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలతో ముందుకుసాగాలి. ఆన్‌లైన్ విధానంలో ఏదైనా ఆర్డర్ చేసేముందు సంబంధిత కంపెనీ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలనే విషయాన్ని వివరించాలి.

జిల్లాలో వెలుగుచూసిన సైబర్ నేరాలు

- వీర్నపల్లి స్టేషన్ పరిధిలో ఫేస్‌బుక్‌లో గోల్డ్ కాయిన్స్ సంబంధిత ఓ యాడ్ చూసి వాటిని కొనేందుకు ఓ బాధితుడు జీఎస్టీ చెల్లింపు కోసం రూ.1230 పంపించాడు. కానీ ఎలాంటి స్పందన రాకపోవడంతో నష్టపోయాడు.
- సిరిసిల్ల టౌన్ స్టేషన్ పరిధిలో బాధితుడికి వాట్సాప్‌లో మెసేజ్ రాగా అందులో ఒక లింక్‌ని క్లిక్ చేశాడు. కొన్ని వస్తువులను ఆర్డర్ చేసిన తర్వాత తిరిగి వద్దనుకొని నగదు కోసం ప్రయత్నిస్తే సైట్ కనిపించలేదు. దీంతో బాధితుడు రూ. 5.36 లక్షలు నష్టపోయాడు.
- ఇన్‌స్టా గ్రామ్‌లో యాడ్ చూసి రూ.2లక్షల వరకు లోన్ సదుపాయం ఉందని నమ్మిన ఓ యువతి లోన్‌కు ముందు చార్జెస్ కోసం అని కొంతడబ్బు పంపింది. కానీ బాధితురాలికి ఎలాంటి లోన్ రాలేదు. కాగా రూ.17,850 నష్టపోయింది.
- ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బాధితురాలికి వాట్సాప్‌లో జాబ్‌లింక్ వచ్చింది. ఆ లింక్ క్లిక్ చేస్తే టెలిగ్రామ్‌కి కనెక్ట్ అయింది. దాంట్లో పనిచేసేందుకు కొంతసొమ్మును చెల్లించింది. నగదును విత్‌డ్రా చేసేందుకు ఆప్షన్ లేకపోవడంతో రూ.5వేలు నష్టపోయింది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- లాటరీ వచ్చిందని, కాల్ కానీ, మెసేజ్ కానీ వస్తే విషయాన్ని గ్రహించాలి.
- అపరిచిత వ్యక్తుల నుంచి వీడియో కాల్స్ లిఫ్ట్ చెయొద్దు.
- వేలల్లో పెట్టుబడి లక్షల్లో లాభాలు అంటూ వచ్చే వాట్సాప్, టెలిగ్రాం ప్రకటనలను నమ్మొద్దు.
- ఇన్‌స్టాగాంలో మీకు తెలిసిన వ్యక్తి ఫొటో ఉండి మిమ్మల్ని డబ్బులు పంపమని అడిగితే వారి గురించి పూర్తిగా తెలుసుకోవాలి.
- సైబర్ నేరగాళ్ల మోసం జరిగిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేస్తే సహాయం అందుతుంది.

సైబర్ నేరాలపై చర్యలు తీసుకుంటాం



సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఓ బృందంగా ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. అనుమానిత, అనధికార సైట్స్‌లో వస్తువులు కొనడం, లావాదేవీల లాంటి వాటికి దూరంగా ఉండాలి. **–అఖిల్ మహాజన్,ఎస్పీ, సిరిసిల్ల**

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత



మాట్లాడుతున్న జడ్జి ప్రేమలత

సిరిసిల్లటౌన్: దేశంలో మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత తెలిపారు. సిరిసిల్లలోని కోర్టు ప్రాంగణంలో సిరిసిల్ల సఖీ సెంటర్ ఆధ్వర్యంలో ‘మహిళ సాధికారత కోసం ఆధునిక ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం’ అనే అంశాలపై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాజ్యాంగపరమైన హక్కులపై అవగాహన ఉండాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య, న్యాయసేవాసమితి సభ్యుడు చింతోజు భాస్కర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతం, సఖీ సెంటర్ నిర్వాహకులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఏం చేసింది?

- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు

వేములవాడఅర్బన్: పదేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గంలోని ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మిడ్ మానేరును పూర్తి చేయడంతోపాటు ముంపు గ్రామాల్లోని 90 శాతం సమస్యలను పరిష్కరించామని పేర్కొన్నారు. మల్కపేట రిజర్వాయర్ పనులు చివరిదశలో ఉన్నాయని, కలికోట సూరమ్మ పనులు కూడా చేయవలసిన దశలో ఉన్నాయని వివరించారు. మున్సిపల్ పరిధిలో రూ.42 కోట్లతో మిషన్ భగీరథ, రూ.30కోట్లతో ఆలయ విస్తరణకు భూసేకరణ, రూ.17 కోట్లతో గుడిచెరువు గోదావరి జలాల ఎత్తిపోతలు, బద్దిపోచమ్మ ఆలయ విస్తరణకు భూసేకరణ పనులు కళ్ల ముందే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మోహన్ రెడ్డి, నాయకులు

సిరిసిల్ల టౌన్: ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం సిరిసిల్లలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ ఈనెల 10 నుంచి నిర్వహించే ‘ఖేలో ఇండియా..జీతో ఇండియా’ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, కార్తీక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగేంద్ర చారి

- వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి

చందుర్తి(వేములవాడ): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి పేర్కొన్నారు. చందుర్తి మండలం తిమ్మాపూర్‌లో గ్రామస్తులు, ఆద్య గోలీమోహన్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన కెమెరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సర్పంచ్ అట్టపెల్లి రమ్య, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమేశ్, ఆద్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోలీ మోహన్, న్యాయవాదులు పిట్టల భూమేశ్, నల్ల దివాకర్, కాపిల్ల శంకర్, కాపిల్ల నరేశ్, పిట్టల దేవయ్య, బుర్రి భూమరాజు, పిట్టల అజయ్, ఆవునూరి అశోక్, నరేశ్, దేవయ్య పాల్గొన్నారు.

ఎండుతున్న పంటపొలాలు

- బావుల్లో అడుగంటిన నీరు
- బీడుగా మారుతున్న పచ్చని పొలాలు
- ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటికోసం రైతుల ఎదురుచూపు



బీటలు వారుతున్న పొలం

వేములవాడ రూరల్ : మండలంలోని ఫాజుల్‌నగర్ వద్ద ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని సాగుకోసం వినియోగించుకోవాలన్న రైతన్నల ఆశలు ఆవిరవుతున్నాయి. ప్రాజెక్టు నీటిపై ఆధారపడ్డ రైతులు వరిపంటను సాగుచేశారు. బావుల్లో నీరు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయి. పొట్టదశలో ఉన్న పంటలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లంపల్లి నుంచి గంగాధర, కొడిమ్యాల మీదుగా ఫాజుల్‌నగర్ చేరుకునే ఈ నీరు వేములవాడ, రుద్రంగి, చందుర్తి, జోగాపూర్ పంప్‌హౌజ్ వరకు వెళ్తుంది. రెండు పంటలు సాగు చేసుకునే రైతులకు ఈ సంవత్సరం సకాలంలో నీరందక ఆందోళన చెందుతున్నారు. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు సాగుకు నీరందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేల ఎకరాలు బీడుగా మారుతున్నాయి.

పెట్టుబడి రావడమే కష్టం



ఎల్లంపల్లి నీటిపై ఎంతో ఆధారపడి వరిపంట సాగుచేశాం. పంట పొట్టదశలో ఉంది. బావుల్లో నీరందక పొలాలు ఎండిపోతున్నాయి. ప్రాజెక్టు నీరందకపోతే పెట్టుబడి సైతం రాని పరిస్థితి నెలకొంది. – గడ్డం చంద్రయ్య, రైతు, ఫాజుల్‌నగర్

అధికారులు చర్యలు తీసుకోవాలి



రోజురోజుకూ పెరుగుతున్న ఎండలంతో పచ్చని పొలాలు బీడుగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎల్లంపల్లి నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలి. – వెంగళి లక్ష్మిరాజం, రైతు, ఫాజుల్‌నగర్

వారం రోజుల్లో సాగునీరందిస్తాం



మేడారం పంప్‌హౌజ్ వద్ద మరమ్మతులు జరుగుతున్నాయి. మరమ్మతు పనులు పూర్తికాగానే పంటల సాగుకు నీటిని విడుదల చేస్తాం. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం. –సంతు ప్రకాశ్‌రావు, ఎల్లంపల్లి ఈఈ, రాజన్న సిరిసిల్ల

ఎంపీటీసీ రాము పార్టీ నుంచి సస్పెండ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని చిన్నలింగాపూర్ ఎంపీటీసీ బైరినేని రామును బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడి పదవి నుంచి, పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎంపీటీసీ బైరినేని రాము పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్షీరాభిషేకంతోనే సస్పెన్షన్

చిన్నలింగాపూర్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 500 మంది రైతుల పంటపొలాలు ఎండిపోకుండా.. మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుని రంగనాయకసాగర్ నుంచి కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. కృతజ్ఞత తెలుపుతూ ఎంపీటీసీ రాముతోపాటు రైతులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ నేపథ్యంలోనే బైరినేని రామును సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని ఆరెపల్లికి చెందిన చీకట్ల పోచమ్మ(70) వృద్ధురాలు సోమవారం ఉదయం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పోచమ్మ అనారోగ్యంతో, మతిస్థిమితం సరిగ్గా లేక ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. మృతురాలి కొడుకు కిష్టయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



దిలీప్ (ఫైల్)

రుద్రంగి (వేములవాడ): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలుకాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గసికంటి దిలీప్ (22) డిసెంబర్ 26న మరో ముగ్గురు స్నేహితులతో కలిసి రుద్రంగి నుంచి వేములవాడకు కారులో వెళ్తుండగా మూడపల్లి వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా దిలీప్‌కు తీవ్రగాయాలుకాగా అప్పటి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి వేములవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడికి తండ్రి నారాయణ, తల్లి రాజవ్వ, సోదరుడు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. దిలీప్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సోమవారం దిలీప్ అంత్యక్రియలు నిర్వహించారు.

టెక్స్‌టైల్ పార్క్ సమస్యలు పరిష్కరించండి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ



టెక్స్‌టైల్ పార్కులో మాట్లాడుతున్న కోడం రమణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులోని సమస్యలను మంత్రి కేటీఆర్ పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. టెక్స్‌టైల్‌పార్కులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలు మూతపడుతున్నాయని.. గతంలో 110 పరిశ్రమలు ఉంటే ప్రస్తుతం సగానికి పైగ మూతపడ్డాయన్నారు. 2020 మే నెలలో మంత్రి కేటీఆర్ ప్రారంభించిన క్యాంటీన్ ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదన్నారు. మూతపడిన పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని సుగ్లాంపల్లికి చెందిన బొడ్డు అర్జున్ (60) చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై ఉపేందర్‌రావు కథనం ప్రకారం.. అర్జున్‌కు ఫిట్స్ ఉంది. అప్పటినుంచి మానసిక్థితి సరిగ్గా లేదు. ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ.. ఎదురొచ్చిన వారిని దుర్భాషలాడేవాడు. ఈనెల ఒకటిన సుల్తానాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని తిట్టడంతో అర్జున్‌ను కొట్టాడు. స్థానికులు 108లో ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ ఈనెల మూడున మృతిచెందాడు. అర్జున్ సోదరుడు బాపురాజ్ ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైభవం.. బ్రహ్మోత్సవం



వేంకటేశ్వరస్వామివారి ఊరేగింపు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



గోదావరిలో నీడలేక ఎండలో సేద తీరుతున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రం నారసింహ నామంతో మారుమోగుతుంది. స్వామివారి సన్నిధిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తుండగా, సోమవారం నాల్గో రోజుకు చేరాయి. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. దారి పొడవున మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. స్థానిక ఇసుక స్తంభం వద్ద స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తుల సౌకర్యార్థం వేసిన చలువ పందిళ్లు సరిపోక చీరలతో గుడారాలు వేసుకొని సేద తీరుతున్నారు. గోదావరిలోని మంగలిగడ్డ పుష్కర ఘాటు భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి భక్తులకు తనవంతు సేవలందించారు.నేడు డోలోత్సవం, తెప్పోత్సవం బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు మంగళవారం సాయంత్రం బ్రహ్మపుష్కరిణి కోనేరులో స్వామివార్ల డోలోత్సవ, తెప్పోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి 50 వేల మంది భక్తులు రానున్నట్లు అధికారులు అంచనా వేశారు.